### ధర్నాను విజయవంతం చేయండి

ఎదులాపురం, సెప్టెంబర్ 27 : కార్మికుల సమస్యల పరిష్కారం ఈ నెల 30వ తేదీన ఛలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ వెంకట నారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు కార్మిక, మూడు నేర చట్టాలను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ స్కీం, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పకడ్బందీగా అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు శేషారావ్, నర్సింగ్, దేవీదాస్, అఖిల్, జనార్దన్ పాల్గొన్నారు.

### అందుబాటులోకి శనగ విత్తనాలు

బోథ్, సెప్టెంబర్ 27 : యాసంగిలో సాగు కోసం శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని బోథ్ ఐకేపీ ఏపీఎం మాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు కంపెనీలకు సంబంధించిన 25 కిలోల బస్తాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కావాల్సిన రైతులు 9121102020 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

### వ్యాధుల ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

ఇచ్చోడ(సిరికొండ), సెప్టెంబర్ 27 : గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులు చేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లకు వాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీవో సంతోష్ కుమార్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సిరికొండలోని పీహెచ్‌సీలో గ్రామ పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ్, వైద్య సిబ్బంది మహేశ్, గంగారాం, ఏఎన్ఎం సుశీల, ఆశకార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.

### నేడు జాతీయ లోక్ అదాలత్

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 27 : నిర్మల్ జిల్లాలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల తెలిపారు. వివాదాలు, రాజీపడే క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్న టూ, ఫోర్ వీలర్ కేసులు, పీటీ కేసులు సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు.

### నిధులు మంజూరు చేయాలి

సోన్, సెప్టెంబర్ 27: సోన్‌లోని ఈద్గా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మైనార్టీలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావును కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో తమకు ప్రార్థన చేయుటకు ఇబ్బంది ఉందని, ఈద్గా నిర్మాణానికి రూ. 10లక్షలు మంజూరు చేయాలని కోరారు.

### గణిత పాఠ్యాంశం విడుదల

బోథ్, సెప్టెంబర్ 27 : కన్గుట్ట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు చిలుక సతీశ్ రూపొందించి 'సులభంగా టేబుల్స్ నేర్పడం ఎలా?' అనే గణిత పాఠ్యాంశాన్ని ఎంఈవో ఇదాపు పోశెట్టి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ సులభమైన పద్ధతిలో రూపొందించిన పాఠ్యాంశం బాగుందని అభినందించారు. వినూత్న కార్యక్రమాలతో పాఠ్యాంశాలను బోధనను ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రతి రోజూ 30 నిమిషాలు వాకింగ్ చేయాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 27 : సీనియర్ సిటిజన్ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన వయోవృద్ధుల వాకింగ్ ఉత్సాహంగా సాగింది. వయోవృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవీదాస్ దేశ్‌పాండే మాట్లాడుతూ ప్రస్తుత ఒత్తిడి సమాజంలో నడక ఎంతో అవసరమన్నారు. ప్రతి రోజూ కనీసం 30 నిమిషాలైన వాకింగ్ చేయాలని సూచించారు. దాని కారణంగా ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు రాంకులకర్ణి, లింగయ్య, అప్సర్‌ఖాన్, దేవన్న, డీడబ్ల్యూవో కార్యాలయ సిబ్బంది, ఎఫ్ఎం పోశెట్టి పాల్గొన్నారు.

### ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

ఎదులాపురం, సెప్టెంబర్ 27 : ఆదిలాబాద్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్, యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె సంగీత మాట్లాడుతూ విద్యార్థులు టూరిజం రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని టూరిస్ట్ కేంద్రాల గురించి ప్రచారం చేయాల్సిన బాధ్యత టూరిజం క్లబ్ సభ్యులపై ఉందన్నారు. నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ విజేతలు మలీహ మహీన్, అలియా గౌహర్, ఆకుల శిరీష్, సదఫ్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యువ టూరిజం క్లబ్ సమన్వయ కర్త డాక్టర్ పత్తివార్ శ్రీనివాస్, సభ్యులు సంతోష్ కుమార్, డీఎస్ చక్రవర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

జైనథ్, సెప్టెంబర్ 27: ఆడ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐకేపీ ఏపీఎం భగవాండ్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో సైతం ఆరోగ్యలక్ష్మి పథకాన్ని పకడ్బందీగా అమలు పర్చాలని సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు జైరాం, పంచాయతీ కార్యదర్శి నేహ, ఐకేపీ సీసీ శ్రీనివాస్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ రజిత ఉన్నారు.

### గురుకులం సందర్శన

బేల, సెప్టెంబర్ 27: బేలలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకులాన్ని శుక్రవారం మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్ సందర్శించారు. మహాత్మా జ్యోతి బాపూలే గురుకులంలో ఉన్న సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయంలో నిద్రించడానికి గదులు సరిపోవడం లేదని విద్యార్థులు ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ మహాత్మా జ్యోతి బాపూలే గురుకులంలో అదనపు తరగతి గదులు, ఆర్‌వో ప్లాంట్ అవసరమని తెలిపారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రంగన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

### అగ్నిమాపక వాహనం ప్రారంభం

ఇచ్చోడ, సెప్టెంబర్ 27 : ఇచ్చోడలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన అగ్నిమాపక వాహనాన్ని శుక్రవారం ఇన్‌చార్జి ఫైర్ స్టేషన్ అధికారి ఎం అశోక్ పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల సమయాల్లో ఇచ్చోడ ఫైర్ అధికారి 87126 99215, ఫైర్ స్టేషన్ 8712699214 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ దేవేందర్, డ్రైవర్లు పాల్గొన్నారు.

### నాణ్యమైన భోజనం అందించాలి

తలమడుగు, సెప్టెంబర్ 27: పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని తహసీల్దార్ రాజమోహన్ అన్నారు. శుక్రవారం నందిగావ్ గ్రామంలో దిశా మోడల్ స్కూల్, అర్లి(కే)లోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో కార్యదర్శులు ఉన్నారు.

## గంజాయి విక్రయ దారుడు అరెస్ట్ రిమాండ్

ఎదులాపురం, సెప్టెంబర్ 27 : ఆదిలాబాద్‌లోని రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం గంజాయి విక్రయిస్తున్న బేల మండలానికి చెందిన కడప సుపారి(41) అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ ఎస్ఐ విష్ణు ప్రకాష్ తెలిపారు. అతని వద్ద 56 గ్రాముల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఎదులాపురం: నివాళులర్పిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



ఇచ్చోడ: నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



కుంటాల: కల్లూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

# చిరస్మరణీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

ఎదులాపురం, సెప్టెంబర్ 27 : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ నాయకురాలు ఆత్రం సుగుణ, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించిన కొండా లక్ష్మణ్ బాపూజీ చిరస్మరణీయుడిగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నారాయణ, జగదీశ్, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజేందర్, నాయకులు పాల్గొన్నారు.

తాంసి/ఇచ్చోడ/, తలమడుగు, సెప్టెంబర్ 27: తాంసిలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మి కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తలమడుగు, పలు మండలాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించారు.

సారంగాపూర్/నర్సాపూర్(జీ)/భైంసా/లోకేశ్వరం/కుంటాల/ముథోల్/తానూర్/పెంబి/దస్తురాబాద్/ సెప్టెంబర్ 27: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రను కొనియాడారు. కార్యక్రమాల్లో పద్మశాలీ సంఘం నాయకులు, అధికారులు, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### రైతుల అభివృద్ధి కృషి చేయాలి

నేరడిగొండ, సెప్టెంబర్ 27 : సహకార సంఘ రైతుల అభివృద్ధికి కృషి చేయాలని పీఏసీఎస్ చైర్మన్ సాబ్లె కిశోర్ సింగ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 01 ఏప్రిల్ 2024 నుంచి 26 సెప్టెంబర్ 2024 వరకు జరిగిన జమ, ఖర్చుల వివరాలు వివరించారు. అనంతరం నేరడిగొండలోని సహకార సంఘం ఆధ్వర్యంలో కొత్త సబ్ బ్రాంచ్‌ని ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ వెంకటరమణ, డైరెక్టర్లు, సీఈవో నాగభూషణ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛ భారత్

బోథ్, సెప్టెంబర్ 27 : అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు శుక్రవారం బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జడ్జి బీ హుస్సేన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏజీపీ పంద్రం శంకర్, న్యాయవాది కుమ్మరి విజయ్‌కుమార్, కోర్టు సూపరింటెండెంట్ శేఖర్ రెడ్డి, శ్రీకాంత్, కోర్టు పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఇంటింటికీ తాగునీరు చేరాలి

ఉట్నూర్, సెప్టెంబర్ 27: గ్రామీణ ప్రాంతాల్లో మంచి నీటి సరఫరా అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ గ్రామ సహాయకుల శిక్షణ శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి కొరత రావద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్పీరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్సీ సురేశ్ కుమార్, ఏఈఈ సురేందర్ పాల్గొన్నారు.

### గోండి లిపి పండితుడి మృతి తీరని లోటు

నార్నూర్, సెప్టెంబర్27: గోండి లిపి పండితుడి మృతిని తీరని లోటని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం గుంజాల గ్రామంలో ఇటీవల మృతి చెందిన కోట్నాక్ జంగుతో పాటు ఆర్క జైవంత్‌రావ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### అనాథ పిల్లలకు ఆర్థిక సాయం

ఇచ్చోడ(సిరికొండ), సెప్టెంబర్ 27: సిరికొండకు చెందిన దాసరి శ్రీను–రజిత ఇటీవల మృతి చెందారు. అనాథలైన పిల్లలు మేఘన, రిశ్వాంత్‌కు శుక్రవారం శ్రీ సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవి కిరణ్ యాదవ్ తనవంతుగా తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.10 వేల ఫిక్స్ డిపాజిట్, రెండు నెలల నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు మహేందర్, సభ్యులు పోశాలు, రవి, రాజన్న, రాములు, మాజీ సర్పంచ్ పెంటన్న, బాలాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

### డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ఎదులాపురం,సెప్టెంబర్ 27 : పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులను కట్టడి చేయవచ్చని డీఎల్ఎస్ఏ కార్యదర్శి బోనగిరి సౌజన్య అన్నారు. ఆదిలాబాద్‌లోని కేఆర్‌కే కాలనీలోని బస్తీ దవాఖానలో న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య ప్రారంభించారు. రోగులను పరీక్షిస్తున్న తీరును పరిశీలించారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ గంగారాం, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అశోక్, ప్యానల్ న్యాయవాది అజయ్, వైద్యులు పాల్గొన్నారు.

### రైతు భరోసా నిధులు మంజూరు చేయాలి

తాంసి, సెప్టెంబర్ 27 : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు వెంటనే మంజూరు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. శుక్రవారం తాంసిలో రైతులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వానకాలం పంట ముగిస్తున్న రైతులకు రైతు భరోసా నిధులు జమ కావడం లేదని వాపోయారు. కేసీఆర్ ప్రభుత్వం రెండు పంటలకు విడుతల వారీగా ప్రతి రైతుకి ఒక ఎకరానికి రూ.10 వేలు రైతుబంధు నిధులు విడుదుల చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఒక పక్క రుణమాఫీ కాకా, మరొకపక్క రైతు భరోసా, పంటల బీమా నిధులు రాక దళారుల వద్ద వడ్డీకి అప్పులు తెచ్చుకుంటున్నారని వెల్లడించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ, రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు సతీశ్ రెడ్డి, అశోక్, సంతోష్ రెడ్డి, నరోత్తం రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

### వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

తలమడుగు, సెప్టెంబర్ 27: వర్షాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. శుక్రవారం మండలంలోని గిరిజన గ్రామాల్లో పర్యటించారు. దేగామ గ్రామానికి చెందిన చిన్నారికి డెంగీ రావడంతో పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ దవాఖానలో సంప్రదించాలని సూచించారు. అనంతరం నిల్వ ఉన్న నీటి పారబోయించారు. ఆమె వెంట వైద్యాధికారి డాక్టర్ హరీశ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

### విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలి

ఇంద్రవెల్లి, సెప్టెంబర్27 : ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఉపాధ్యాయులకు ఆదేశించారు. శుక్రవారం ఇంద్రవెల్లి గిరిజన ఆశ్రమోన్నత బాలికల పాఠశాలను ఐటీడీఏ పీవో తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం వండిన వంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థినుల ఆరోగ్య విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య సిబ్బందిని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్ ఉన్నారు.

## కేసీఆర్ నేతృత్వంలోని పోరాటంతోనే తెలంగాణ

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- తెలంగాణను ఇచ్చింది కాంగ్రెస్సే అనడంపై రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌పై మండిపాటు



రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్యతో వాదిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, సెప్టెంబర్ 27 : కేసీఆర్ నేతృత్వంలో ఉద్యమకారులు చేసిన పోరాటానికి కాంగ్రెస్ ప్రభుత్వం దిగిరావడంతోనే తెలంగాణ సాధ్యమైందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలో శుక్రవారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా విగ్రహావిష్కరణ సభలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టేనని, కానీ కొంత మంది తామే తెచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. ఈ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండిపడ్డారు. దేశ స్వాతంత్రం కోసం లక్షల మంది పోరాడితేనే బ్రిటిష్ వారు దిగివచ్చి స్వాతంత్ర్యం ఇచ్చారని తెలిపారు. అలాగే తెలంగాణ సాధన కోసం ఉద్యమకారులు, అన్ని వర్గాల ప్రజలతో కలిసి కేసీఆర్ ఉద్యమిస్తేనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిందని గుర్తు చేశారు. ఇరువురి నాయకుల మధ్య వాగ్వాదం పెరగడంతో పోలీసులు, పద్మశాలీ సంఘం నాయకులు కల్పించుకొని సర్ది చెప్పారు.

### కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

భైంసా, సెప్టెంబర్ 27 : రైతాంగానికి మద్దతు ధర రావాలన్న ఉద్దేశంతో మార్క్‌ఫెడ్ ద్వారా అక్టోబర్ 5 నుంచి సోయా కొనుగోళ్లను చేపడుతామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం భైంసాలోని తన నివాసంలో మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డితో సమావేశమై కొనుగోళ్ల విషయమై చర్చించారు. సమావేశంలో కుభీర్ పీఏసీఎస్ చైర్మన్ రాష్ట్ర బోర్డు డైరెక్టర్ గంగాచరణ్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

భైంసా, సెప్టెంబర్ 27 : జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో భైంసా పట్టణానికి చెందిన వికాస్ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలవడంతో విద్యార్థులను ఎమ్మెల్యే రామారావు పటేల్ అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజన్న, డైరెక్టర్ నిమ్మ రవీన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

### పేదలకు నాణ్యమైన సేవలందించాలి

ముథోల్, సెప్టెంబర్ 27 : గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలకు ప్రభుత్వ దవాఖానలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ వైద్యులకు సూచించారు. శుక్రవారం ముథోల్‌లోని ప్రభుత్వ దవాఖానను ప్రత్యేకంగా పరిశీలించారు. రోగులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్, డా. అనిల్ జాదవ్, ఎంపీటీసీ భూమేశ్, బీజేపీ మండలాధ్యక్షుడు పోతన్న, నాయకులు ఉన్నారు.

### అరుదైన శస్త్ర చికిత్స



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 27 : తానూర్ మండలం ఎల్వి గ్రామానికి చెందిన మారుతి కొంత కాలంగా వెన్నుముక సమస్యతో బాధపడుతున్నాడు. ఇప్పటికే పలు దవాఖానల్లో వైద్య పరీక్షలు చేయించుకున్నా ఫలితం లేకపోయింది. చాలా అరుదైన ఆరోగ్య సమస్యను అత్యంత నాణ్యమైన శస్త్ర చికిత్సను నిర్మల్‌లోని డాక్టర్స్ లైన్‌లో గల స్వప్న మల్టీ స్పెషాలిటీ దవాఖాన వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. స్పైనల్ కార్డులో ట్యూమర్ ఉన్నట్లుగా గుర్తించి న్యూరో సర్జన్ డాక్టర్ జగన్ కుమార్, జనరల్ న్యూరో సర్జన్ నాళం శశికాంత్ అరుదైన శస్త్ర చికిత్స చేసి ట్యూమర్‌ను తొలగించారు. వెన్నుముకలో ట్యూమర్ ఇలాగే ఉండి ఉంటే ఆయన కాల్లు చచ్చుబడిపోయి పక్షవాతానికి గురయ్యేవాడని వైద్యులు తెలిపారు. దవాఖానలోని ఆరోగ్య శ్రీ సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### కుంటాలలో 9వ శతాబ్దపు రాష్ట్రకూట బైరవ విగ్రం



విగ్రహం వద్ద పరిశోధకుడు డాక్టర్ దేవరావు

కుంటాల, సెప్టెంబర్ 26 : నిర్మల్ జిల్లా కుంటాలలోని ప్రాచీన గ్రామ దేవత గజ్జలమ్మ ఆలయానికి తూర్పున 100 మీటర్ల దూరంలో క్రీస్తు శకం 6వ శతాబ్దానికి చెందిన రాష్ట్ర కూట రాజు చిక్కిన బైరవుని విగ్రహాన్ని గుర్తించినట్లు ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ తుమ్మల దేవరావు తెలిపారు. రాష్ట్ర కూటుల కాలంలో ఈ గ్రామం వైభవంగా వెలిగినట్లు ఇక్కడ వెలుగులోకి వచ్చిన విగ్రహాల తెలుస్తుంది. నిర్మల్ జిల్లా ప్రాంతం రాష్ట్రకూట రాజు రెండవ కృష్ణుని ఎలుబడిలో ఉన్నట్లు దిలావర్‌పూర్‌లో వెలుగులోకి వచ్చిన శాసనం వల్ల తెలుస్తుంది. కుంటాల గ్రామానికి రాష్ట్ర కూట రెండవ కృష్ణుని వల్లనే ఈ గ్రామానికి పేరు వచ్చినట్లు భావించవచ్చని తెలిపారు. ఈ క్షేత్ర పర్యటనలో తుమ్మల దేవరావుతో పాటు అబ్బడి రాజేశ్వర్ రెడ్డి, తుమ్మల సుజాత పాల్గొన్నారు.

### ఫ్రైడే.. డ్రైడే నిర్వహించాలి

ఎదులాపురం,సెప్టెంబర్ 27 : ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కచ్చితంగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడేను నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో ఉన్న కుండీలు, డ్రమ్ములు, వాడుకలో లేని వస్తువులో ఉండే నీరు వల్ల దోమలు, ఈగలు చేరి అనారోగ్యానికి గురి చేస్తాయన్నారు. అటువంటిని వాటలో నీటిని తొలగించాలన్నారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటి దవాఖానను సందర్శించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పద్మభూషణ్, డీఆర్‌డీఏ సాయన్న, డీఎల్‌పీవో ఫణీంద్ర, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, వైద్యాధికారి సర్ఫరాజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### విహారయాత్రకు బయలుదేరిన విద్యార్థులు

ఎదులాపురం, సెప్టెంబర్ 27 : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులు శుక్రవారం కుంటాల జలపాతం విహారయాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా విహారయాత్ర బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో పర్యాటక శాఖ అధికారి రవికుమార్, డీఈవో ప్రణీత, ఏఎస్‌వో శ్రీహరిబాబు, తదితరులు ఉన్నారు.

### అంగన్‌వాడీ పిల్లలతో కలిసి భోజనం చేసిన కలెక్టర్

ఎదులాపురం, సెప్టెంబర్ 27 : ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న భోజనంతో పాటు రిజిస్టర్, రికార్డులు పరిశీలించారు. ఎంత మంది పిల్లలు ఉన్నారు అని అంగన్‌వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు.

### పాఠశాలాల అభివృద్ధికి కృషి

బోథ్, సెప్టెంబర్ 27: బోథ్ నియోజకవర్గ పరిధిలోని పాఠశాలాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అనిల్ అన్నారు. శుక్రవారం బోథ్‌లోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలను సందర్శించారు. పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యేకు విద్యార్థినులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి లక్ష్యాలను సాధించాలన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగానని గుర్తు చేశారు. వంట గది, పాఠశాల పరిసరాలను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ఆర్ సంధ్యారాణి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, ప్రత్యేకాధికారిని వళిత, నాయకులు తాహెర్ బిన్ సలాం, లింగారెడ్డి, వెంకటరమణ గౌడ్, రఫీ పాల్గొన్నారు.

### నాగోబాను దర్శించుకున్న అసిస్టెంట్ కలెక్టర్

ఇంద్రవెల్లి, సెప్టెంబర్27: కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా ఆలయాన్ని శుక్రవారం అసిస్టెంట్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్‌కుమార్‌సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. మెస్రం వంశీయులు అసిస్టెంట్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్‌కుమార్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆలయ చరిత్రతో పాటు నాగోబా జాతర, సంస్కృతీ సంప్రదాయాల గురించి మెస్రం వంశీయులు వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌వో సందీప్‌కుమార్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, మాజీ సర్పంచ్ మెస్రం నాగ్‌నాథ్, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 27: వృద్ధుల సంక్షేమానికి కల్పించిన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సీడీపీవో నాగమణి అన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నిర్మల్‌లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో వయొవృద్ధుల అసోసియేషన్ సభ్యులు, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ, మహిళల శిశు దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న, సెక్రటరీ హన్మంతరెడ్డి, పీ వికాస్, ఏసీడీపీవో నాగలక్ష్మి, న్యాయవాదులు లింగాగౌడ్, రాజలింగం, నరేందర్, మధుకర్, జిల్లా సంక్షేమ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్జీయూకేటీలో ముగిసిన స్మార్ట్ గ్రిడ్

బాసర, సెప్టెంబర్, 27: బాసర ఆర్జియూ కేటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలోని వారం రోజుల పాటు నిర్వహించబడిన స్మార్ట్ గ్రిడ్, పునరుత్పాదక శక్తి వనరులపై జరిగిన సదస్సు ముగిసింది. ఈ కార్యక్రమం లక్ష్యంలో స్మార్ట్‌గ్రిడ్, పునరుత్పాదక ఇంధన వనరులపై జ్ఞానాన్ని మెరుగుపరచడం వంటి అంశాలతో కొనసాగింది. సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా, అనలిటిక్స్, పవర్ క్వాలిటీ రియల్ టైమ్ సిమ్యులేషన్ సిస్టమ్‌లు వంటి స్మార్ట్ గ్రిడ్‌లోని బహుళ రంగాల్లో అనేక రకాల అంశాలను కవర్ చేయడానికి నిమిషాల వ్యవదిలో ప్రతి సెషన్‌తో నిర్మాణాత్మక మద్దతు, వనరులను అందించేందుకు ఈ ప్రోగ్రాం నిర్వహించడంతో ఎంతో ఉత్తమమైందని ఇంజినీరింగ్ అసోసియేటెడ్ మహేశ్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ భావుసింగ్, సిస్టమ్ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

### గోదావరిలో ఒకరి గల్లంతు

బాసర, సెప్టెంబర్ 27: బాసర గోదావరి వద్ద శుక్రవారం ఒకరు గల్లంతైన ఘటన చోటు చేసుకుంది. నిజామాబాద్ జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు ముగ్గురు నదిలో స్నానానికి దిగగా ప్రమాదవశాత్తు ప్రవాహంలో కొట్టుకుపోయారు. గమనించిన భక్తులు ప్రమాదం నుంచి భార్యభర్తలైన కృష్ణవేణి రవిలను కాపాడగా జయ (45) అనే మహిళ గల్లంతైంది. సంఘటన స్థలాన్ని రెస్క్యూటీం గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### బాసర ఆలయ తాత్కాలిక ఉద్యోగికి పాముకాటు

బాసర, సెప్టెంబర్ 27 : బాసర ఆలయంలో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తున్న డీ శారదకు డార్మెటరీ హాల్ భవనం వద్ద పాము కాటు వేసింది. వెంటనే గమనించిన ఉద్యోగులు, ఆలయ సిబ్బంది స్థానిక దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం శారద ఆరోగ్యం నిలకడగా ఉంది.

### ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి

తానూర్, సెప్టెంబర్ 27 : తానూర్ మండలం మహాలింగి గ్రామానికి చెందిన తురాటి విఠల్ (35) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో విఠల్ ఇంటి నుంచి కాలకృత్యాలకు చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందాడు. భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### పట్టపగలు దొంగల బీభత్సం

తానూర్, సెప్టెంబర్ 27 : తానూర్ మండలం మహాలింగి గ్రామంలో పట్టపగలే నలుగురు దొంగలు బీభత్సం సృష్టించారు. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా జానకంపేట్ గ్రామానికి చెందిన అశోక్,రాజు, మీణ, పోసమ్మ, శుక్రవారం డబ్బాలు అమ్ముతామంటు గ్రామంలో తిరుగుతూ గ్రామానికి చెందిన ఫీరాజీ ఇంటికి తాళం వేసి ఉండడం గమనించి ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. గమనించిన గ్రామస్తులు వారిని పట్టుకొని తాళ్లతో కట్టేసి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్ఐ రమేశ్ గ్రామానికి చేరుకుని వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. తదుపరి విచారణ చేపట్టిన తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఎస్ఐ వివరించారు.

### అడవి కుందేళ్లు, కంజు పిట్టల వేటగాళ్ల అరెస్ట్

లోకేశ్వరం, సెప్టెంబర్ 27 : లోకేశ్వరం పుస్పూర్ వద్ద గురువారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అటవీ వేటగాళ్లు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 3 అడవి కుందేళ్లు, 5 కంజులు, వేట వలలు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీపూర్‌తండాకు చెందిన నగేశ్, మూడ్ శంకర్ వేటగాళ్లు పట్టుబడినట్లు నిర్మల్ ఎఫ్ఆర్‌వో రామకృష్ణ రావు తెలిపారు. ఇందులో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది అలేఖ్య, ఎఫ్ఎస్‌వో నర్సాపూర్, ఎఫ్‌బీవోలు పాజిల్ హుస్సేన్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 27: మండల కేంద్రంలోని ఓ రైతుకు చెందిన వ్యవసాయ పంటలో పేకాటాడుతున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఏడుగురిని పట్టుకున్నారు. వారి వద్ద రూ.2,731 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ దుబ్బాక సునీల్ తెలిపారు.

### మహిళ ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 27 :నిర్మల్‌లోని బంగల్‌పేట్ కాలనీకి చెందిన ఎట్టరి రాధ కుటుంబ కలహాల కారణంగా శుక్రవారం బంగల్‌పేట్ చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె భర్త వెంటనే డయల్ 100కు సమాచారం అందించారు. రెండు నిమిషాల్లోనే బ్లూకోర్ట్ సిబ్బంది అజర్ ఖాన్, రాథోడ్ అనిల్ అక్కడికి చేరుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న రాధను అడ్డుకుని భర్తకు అప్పగించారు. సకాలంలో స్పందించి ప్రాణాలను కాపాడిన బ్లూకోర్ట్ సిబ్బందిని జిల్లా ఎస్పీ జానకి షర్మిల, సీఐ ప్రవీణ్ కుమార్ అభినందించారు.

### భారీ వర్షానికి కూలిన ఇంటి గోడ

కడెం,సెప్టెంబర్27 : కడెం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన బిరుదుల సురేశ్‌కు చెందిన పెంకుటిల్లు గోడ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. గోడ కూలిన సమయంలో ఇంట్లో అందరూ ఉన్నప్పటికి ఎవరికి ఏమి కాక పోడవంతో పెను ప్రమాదం తప్పింది. సురేశ్‌ది నిరుపేద కుటుంబం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

ఖానాపూర్ రూరల్, సెప్టెంబర్ 27: ఖానాపూర్‌లోని శాంతినగర్‌కు చెందిన బోదాసు సాయమ్మ (70)ను పదేండ్ల నుంచి కన్న కొడుకులు, కూతురు పట్టించుకోక పోవడంతో జీవితంపై విరక్తి చెంది శ్రీరాంనగర్ సమీపంలో ఉన్న గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అక్కడ చేపలు పడుతున్న జాలర్లు ఆమెను చూసి కాపాడారు. 100 డయల్ చేయగా పోలీసులు వచ్చి తీసుకెళ్లారు. సైఐ సైదారావ్ ఆమెకు, కుటుంబీకులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

### 110 గ్రామాలకు భగీరథ నీరు బంద్

తాంసి, సెప్టెంబర్ 27 : తాంసి మండలం పొన్నారి గ్రామ శివారులో భగీరథ మెయిన్ పైప్‌లైన్ పగిలి తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల్లోని 110 గ్రామాలకు భగీరథ నీరు రాక గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. మిషన్ భగీరథ పైప్ లైన్ లీక్ కావడం అధికారుల నిర్లక్ష్యంతోనే జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంటింటికీ భగీరథ నీరు అందక ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలో అధికారులు తూతూ మంత్రంగానే భగీరథ సర్వే చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం నల్లాలలో భగీరథ నీరు రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

### పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఇచ్చోడ, సెప్టెంబర్ 27 : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే వ్యాధులు ప్రబలవని జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మడలంలోని దేవుల్‌నాయక్ తండాను సందర్శించి డ్రై డే పనులను పరిశీలించారు. అనంతరం సాత్ నంబర్‌లోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మణ్, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

### రైతుల అభివృద్ధికి ఐకార్ కృషి

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 27 : రైతులను అన్ని విధాలు అభివృద్ధి చేసేందుకు ఐకార్ కృషి చేస్తున్నదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం కేస్లాపూర్ గ్రామంలోని రైతు వేదికలో ఐకార్ ఆధ్వర్యంలో కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఏర్పాటు చేసిన వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. పనిముట్ల పని విధానాన్ని ఐకార్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ మోటర్‌తో పాటు మందులు స్ప్రే డ్రోన్లతో పాటు వ్యవసాయానికి చెందిన ఇతర పనిముట్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐకార్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.